క్లుప్తంగా

వసతుల కల్పనకే ప్రాధాన్యం



డ్రైయినేజీ పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి అన్నారు. పెద్దపల్లిలోని 26వ వార్డులో రూ. 13.60 లక్షల వ్యయంతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను శనివారం ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజలకు అవసరమైన రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు, తాగునీటి వసతి కోసం పనులకు ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ కట్ట శివప్రసాద్, ఏఈ సతీశ్, కౌన్సిలర్ అమ్రేశ్ తదితరులున్నారు.

గ్రామాల్లో మెడికల్ కళాశాల విద్యార్థుల సర్వే



సర్వే చేస్తున్న మెడికల్ విద్యార్థులు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి, పేంచికల్‌పేట గ్రామాల్లో గోదావరిఖని మెడికల్ కళాశాలకు చెందిన విద్యార్థులు శనివారం ఇంటింటా సర్వే నిర్వహించారు. మెడికల్ కళాశాల విద్యార్థులు ఈ రెండు గ్రామాలను దత్తత తీసుకుని రెండున్నర ఏళ్ల పాటు ప్రతి విద్యార్థి ఐదు కుటుంబాలకు వైద్య సేవలు అందించడానికి దత్తత తీసుకున్నారు. సర్వేలో కుటుంబాల్లో కుటుంబ సభ్యుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల హెచ్‌వోడీ మధుసూదన్, ఇన్‌చార్జి పావని, శ్వేతలున్నారు.

భూపోరాటానికి ఎమ్మార్పీఎస్ మద్దతు



సంగ్రామ యాత్రలో పాల్గొన్న నాయకులు

గోదావరిఖని టౌన్: సంగ్రామ యాత్రలో భాగంగా శనివారం ఎస్సీలను ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ గంగానగర్, సూర్యానగర్, బాపూజీనగర్, విద్యానగర్, లెనిన్‌నగర్‌లో పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ గుండ్ల రాకేశ్ మాట్లాడుతూ సీపీఎం నాయకుడు వైయాకయ్య నాయకత్వంలో జరుగుతున్న భూపోరాటానికి మద్దతు తెలియజేస్తున్నామని, భూమి లేని నిరుపేదలకు ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందన్నారు. యాత్రలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద రవికుమార్, కాసిపేట రాజయ్య, కాంపెల్లి శ్రీనివాస్, మడిపల్లి దశరథం, ఈదునూరి కొమురయ్య, సల్లూరు జయరాజు, రామలక్ష్మి, రాకేశ్ పాల్గొన్నారు.

జీఎం సేవలు అభినందనీయం

గోదావరిఖని: సింగరేణి సంస్థరామగుండం డివిజన్–1 పరిధిలోని జీఎంగా పనిచేస్తూ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కె.నారాయణను శనివారం పలువురు సన్మానించారు. సీఎస్పీ, ఏరియా ఆసుపత్రి, టీటీఈ, జీవీటీసీలో ఏర్పాటు చేసిన వేర్వేరు కార్యక్రమాల్లో శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను బహుకరించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రాంమూర్తి, సీఎస్పీ ఎస్ఈ దాసరి శ్రీనివాస్, శ్రీనాథ్, డీవైసీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్, టీటీసీ డీజీఎం వెంకటరమణ, జీవీటీసీ మేనేజర్ డేనిల్‌కుమార్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూ నాయకులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మిక సంఘం నాయకులకు..

పాలకుర్తి: కేశోరాం కంపెనీలో జరిగిన పర్మినెంట్ కార్మికసంఘం ఎన్నికల్లో విజయం సాధించిన యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బయ్యపు మనోహర్‌రెడ్డి, దాడి మహేశ్‌ను మండలంలోని కన్నాల సింగిల్‌విండో పాలకవర్గం, రాణాపూర్ గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ కుడిక్యాల సురేశ్, ఎంపీటీసీ అతిఖ్, ఉప సర్పంచ్ పుట్ట రంజిత్, డైరెక్టర్లు , నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు..

ఓదెల: మండల తహసీల్దార్ కత్రోజు రమేశ్‌ను విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్ట రాజనందం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. పూలమాల వేసి శాలువాలు కప్పి సన్మానించి మరిన్ని పదోన్నతులను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నాగవెల్లి శ్రీమన్నారాయణ, సిరికొండ వేణుగోపాలచారి, కాసర్ల నర్సింహాచారి, బ్రహ్మణపల్లి రాజయ్య పాల్గొన్నారు.







పగబట్టిన ప్రకృతి..

ఒక్కసారిగా రైతన్నపై ప్రకృతి కన్నెర్రజేసింది... అకాల వర్షాలతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేలపాలైంది.. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి కంటికి రెప్పలా కాపాడుకున్న పంట చేతికందే వేళ వరణుడి తాకిడికి రైతన్న ఆశలన్నీ అడియాశలయ్యాయి.. దేవునిపై భారం వేసి దిక్కుతోచని స్థితిలో అయ్యో దేవుడా ఎందుకిలా చేశావ్ అంటూ ఎవరికీ చెప్పుకోలేక కుంగిపోతున్న రైతుల గుండెల్లో ఆవేదన వర్ణనాతీతం.. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలకు వేల ఎకరాల పంట నష్టం జరగగా కాల్వశ్రీరాంపూర్ మండలం గూడెం, ఇందుర్తి, కొమిరె శివారుల్లో నేల వాలిన మొక్కజొన్న పంట సాక్షి కెమెరాకు కనిపించింది.. – సాక్షి, ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

బ్రహ్మోత్సవాలకు నృసింహుడు ముస్తాబు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలను(జాతర) అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయం ముస్తాబైంది. ఈ నెల 29 నుంచి కొనసాగనున్న ప్రత్యేక పూజలు వచ్చే నెల 6 వరకు ప్రతి రోజు విభిన్న పూజలతో బ్రహ్మోత్సవాలను జరిపేందుకు ఆలయ కమిటీ సభ్యులు, ఈవో, ధర్మకర్తలు సమన్వయంతో కృషి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రంతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా నిర్వహించే కార్యక్రమాలు వచ్చే నెల 1న శనివారం 10.30 గంటలకు స్వామి వారి కల్యాణం, 4న మంగళవారం సాయంత్రం శకటోత్సవం, 6న గురువారం తెల్లవారు జామున శ్రీలక్ష్మి సమేత నర్సింహస్వామి ఉత్సవ మూర్తులతో స్వామివారి రథోత్సవం, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి, తాగునీరు, రవాణా సౌకర్యాలను కల్పించారు. ఆలయాన్ని రంగులతోపాటు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఇన్‌చార్జి ఈవో సదయ్య కోరారు.



పెద్దాపూర్ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం

భయం వీడితే జయం మనదే

సుల్తానాబాద్: పదో తరగతి విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాస్తే విజయం మీ సొంతమవుతుందని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. శనివారం రాత్రి సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ లో వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆశయం ముఖ్యమైతే విజయం దానంతట అదే వస్తుందని, స్కిల్ డెవలప్‌మెంట్ సబ్జెక్టుపై శ్రద్ధ ఉండాలని కోరారు. చక్కగా రాయడంతో పాటు ఒత్తిడి లేకుండా మార్కులతో సంబంధం లేకుండా సబ్జెక్ట్‌లో ప్రావీణ్యత ఉండాలని సూచించారు. ఒత్తిడి ఉన్నప్పుడు మెడిటేషన్ తప్పనిసరిగా చేయాలని విద్యార్థులకు సూచించారు. లక్ష్యసాధన దిశగా విద్యార్థులు చదవాలని కోరారు. విద్యార్థులు ఏప్రిల్ 3 నుంచి జరిగే పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ రావు, జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్ సంజీవరెడ్డి, కార్యదర్శి బుచ్చిరెడ్డి, ఎంఈవో సురేందర్, డైరెక్టర్ లు కృష్ణప్రియ, మాటేటి గట్టయ్య, ప్రిన్సిపాల్ ఆంటోని పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని సుల్తానాబాద్ సీఐ ఇంద్రాసేనారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పాఠశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ విద్యార్థులు రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు చాలామంది ఫోన్లకి అలవాటు పడిపోతున్నారని. వారిని మార్చే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పై ఉందన్నారు. తల్లిదండ్రులను ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉపేందర్ రావు, పాఠశాల డైరెక్టర్ రవీందర్, సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ చందు, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ కిరణ్, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి మాధవి

సంక్షిప్త వార్తలు

స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ శిక్షణ

రామగిరి: ముత్తారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ శిక్షణ నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న 2వ విడత శిక్షణలో భాగంగా ఓడీఎఫ్ అంశాలపై, తడిచెత్త పొడి చెత్త, వాడిన నీటి, ప్లాస్టిక్ నిర్వాహణ మార్గదర్శకాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీవోలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య, జెడ్పీటీసీ చెల్కల స్వర్ణలత, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, స్వచ్ఛ భారత్, కోఆర్డినేటర్ రాఘవులు, ఏపీడీ సత్యనారాయణ, రేణుక, ఎంపీడీవో కలికోట శ్రీనివాస్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీవోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ శాంతినగర్ ప్రజా పాఠశాలలో శనివారం పోషణ్ పక్వాడలో భాగంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో విద్యార్థులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శైలజ, రజిత, మమత, శారద పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

రామగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శనివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీపీ ఆరెల్లి దేవక్క పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. వచ్చే నెల 3 నుండి నిర్వహించనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలలో ప్రతి ఒక్క విద్యార్థి మంచి గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సొసైటీ సభ్యుడు ఇజ్జగిరి సాకేత్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నవారి కలలను సాకారం చేయాలి

రామగిరి: విద్యార్థులు కష్టపడి చదివి కన్నవారి కలలకు సాకారం చేయాలని వైస్ ఎంపీపీ కాపుర బోయిన శ్రీదేవి అన్నారు. మండలంలోని బేగంపేట హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ. 5 వేలు నగదు పారితోషకం ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శారద, సర్పంచ్ బుర్ర పద్మ, ప్రశాంతి, విద్యా కమిటీ చైర్మన్ కట్ట శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రుణబంధం' లఘు చిత్రం సందడి

జ్యోతినగర్: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రెండు రోజులుగా రుణబంధం లఘు చిత్రం యూనిట్ సందడి చేస్తోంది. శనివారం ఎన్టీపీసీ రామగుండం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రాజీవ్ రహదారిపై షూటింగ్ చేశారు. సమాజానికి మంచి సందేశం ఇచ్చే ప్రయత్నంలో భాగంగా యువత పెడదోవ పట్టడం వల్ల జరిగే అనర్థాలు, యువత భవిత ఇతివృత్తంగా మోదంపల్లి రామస్వామి దర్శకత్వంలో నిర్మిస్తున్న రుణబంధం సినిమా చిత్రీకరిస్తున్నారు. యువనటి జక్కని శ్రీలత రామగుండం పోలీస్ కమిషనర్ పాత్రలో నటిస్తుండగా, అంగరక్షకుడిగా బీఆర్‌ఎస్ నాయకులు, సామాజికవేత్త దేవీ లక్ష్మీ నరసయ్య ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

విద్యార్థినులకు ఆయుష్ కిట్ల పంపిణీ

రామగుండం: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థినులకు ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయుష్ మండల వైద్యాధికారి డాక్టర్ వినయకుమారి మాట్లాడుతూ బాలికల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రక్తహీనతను అధిగమించేందుకు, రాష్ట్ర ఆయూష్ విభాగం పౌష్టికాహారం పంపిణీలో భాగంగా రాగి లడ్డూల ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో కస్తూర్బా విద్యాలయ ప్రత్యేక అధికారి కవిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

రామగిరి: ముత్తారం మండల కేంద్రానికి చెందిన గోపగాని మమతకు మంజూరైన రూ. 16 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు రాగుల సతీశ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సమ్మయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శన

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శాంతినికేతన్ పాఠశాలలో విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలిచ్చారు. శనివారం పాఠశాల ఆవరణలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దాదాపు 2 వందల రకాల ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలను పలువురు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాపిరెడ్డి, యాదగిరి, సారయ్య హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

రామగిరి:ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేపట్టారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎకనామిక్స్, ఫిజిక్స్, ప్రైమరీ హెల్త్ నర్సింగ్ పరీక్షకు 240 మంది విద్యార్థులకు 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షకు సీఎస్‌గా డీఎల్ఎస్ రావు, డీవోగా శ్రీధర్ రెడ్డి పర్యవేక్షించారు.

అవగాహనతోనే టీబీ అంతం

రామగుండం: అవగాహనతోనే టీబీ వ్యాధిని నియంత్రించవచ్చని విద్యాధికారులు పిలుపునిచ్చారు. అబాది రామగుండంలోని జెడ్పీహెచ్ఎస్, ప్రైమరీ స్కూల్ విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీబీ నియంత్రణకు చేతులు కలపండంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్లు బొమ్మరవేణి లక్ష్మణ్, రంగపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది అన్నం శ్రీనివాస్, ఎం.అన్నపూర్ణ, విజయ, సుభాషిణి, సమ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోదావరిఖనిటౌన్: కార్పొరేషన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్, శ్రీనివాస టాకీస్, మార్వాడీ స్ట్రీట్, జ్యోతి రైస్‌మిల్ పరిధిలో నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గోదావరిఖని తూర్పు విద్యుత్ శాఖ ఏఈ పెద్దపల్లి కిషన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి మంథనిలో క్రైస్తవ సభలు

మంథని: పట్టణంలోని సియోను ప్రార్థనా మందిరంలో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు క్రైస్తవ వార్షికసభలు ఏర్పాటు చేసినట్లు పాస్టర్లు వల్లూరి ప్రభాకర్, వాసాల జాన్ తెలిపారు. సభల్లో ప్రసంగించేందుకు హైదరాబాద్, కరీంనగర్ శ్యామ్‌కుమార్, ఆగస్టీన్ పాస్టర్లు విచ్చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని పాస్టర్లు, సంఘ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని సభలు విజయవంతం చేయాలని కోరారు.

పాండవుల గుట్టపై 27 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

కాల్వశ్రీరాంపూర్: మండలకేంద్రంలోని పాండవుల గుట్టపై శ్రీజగత్‌మౌనీశ్వరాలయంలో ఈనెల 27 నుంచి 31 వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 31న ఉదయం 11.50 గంటలకు శ్రీ సీతారామచంద్ర స్వామి పట్టాభిషేకం ఉంటుందని, ఉత్సవాలకు వచ్చే భక్తులకు భోజనం, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు.

28న జాతీయ అప్రెంటీస్‌షిప్‌పై అవగాహన సదస్సు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో ఈ నెల 28న అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆర్‌డీడీ సీతారాములు, ప్రిన్సిపాల్ నర్సింహచారి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ, రీజనల్ డైరెక్టరేట్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రైనూర్‌షిప్, రాష్ట్ర ఉపాధి కల్పన సంస్థ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేట్ పారిశ్రామిక యజమాన్యాలు హాజరుకావాలని కోరారు.

వీధి దీపాల ఏర్పాటు

సాక్షి స్పందన

పాలకుర్తి:బసంత్‌నగర్ విమానశ్రయం ప్రతిపాదిత స్థలం మూలమలుపు నుంచి బసంత్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో నూతనంగా వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిని ఆనుకుని ఎస్సారెస్పీ డీ–83 ఉపకాలువ 1–ఎల్ ఉండటం, నిత్యం వందలాది మంది వాహనాదారులు ప్రయాణించే రహదారిపై వీధిదీపాలు లేకపోవడంతో వాహనదారులు కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి సర్పంచ్ కట్టికోల వేణుగోపాలరావు స్పందించారు. ఎయిర్‌పోర్టు మూలమలుపు నుంచి బరిగెల రాములు ఇంటివరకు నూతనంగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలి

ఎలిగేడు: విద్యార్థులు సేవా దృక్పథంతో సేవలందించాలని ఎలిగేడు సర్పంచ్ భూర్ల సింధూజ అన్నారు. శనివారం మండలకేంద్రంలో శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు శిబిరంలో ప్రతి పనిని కష్టంతో కాకుండా ఇష్టపడి చేయాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ రేకులపల్లి శశాంక మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంతో గ్రామంలో వారం రోజులపాటు ఇంటింటి సర్వేతోపాటు, అవగాహన కార్యక్రమాలు ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి సౌమ్య, ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణ్, అధ్యాపకులు, వార్డుసభ్యులు, గ్రామస్తులు,విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

రామగిరి: మండలంలోని లొంకకేసారంలో సెంటినరీకాలనీలోని శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్(జాతీయ సేవా పథకం)శిబిరం కొనసాగుతుంది. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా శనివారం హరితహారం నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మహిళలకు జామ్ తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి. నవీన్‌కుమార్, ఉప సర్పంచ్ ఒజ్జ ఒదెలు, పంచాయతీ కార్యదర్శి అమల, అధ్యాపకులు డాక్టర్ జి. చంద్రశేఖర్, డి. శృతి, షేక్ షరీఫ్, సిబ్బంది రవీందర్, రమేశ్ పాటు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ శిబిరంలో విద్యార్థులు, సర్పంచ్

అభివృద్ధిలో సహకార సంఘాల ముందంజ

మంథని: సహకార సంఘాలకు అన్ని రకాల వ్యాపారాలు చేసే సత్తా కలిగి ఉండి, అభివృద్ధిలో ముందంజలో పయనిస్తున్నాయని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. శనివారం మంథనిలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. కో–ఆపరేటర్ అని ప్రదర్శిస్తున్న వ్యాపార వైవిధ్యం వల్లనే సహకార సంఘాలు బహుళ సేవా కేంద్రాలుగా మార్చుతూ దేశంలోనే తెలంగాణ ఖ్యాతిని చాటుతున్నాయన్నారు. దీనిలో భాగంగానే మంథని మండలం నాగారం శివారులో రైస్ మిల్లు, సంఘంలో బాటిల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శరవేగంగా చర్యలు చేపడుతున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సంఘం ద్వారా రూ. 2కోట్ల 75లక్షల రుతులకు రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. కేడీసీసీ బ్యాంకులో రూ. 3కోట్లకు డిపాజిట్లు పెంచినట్లు వివరించారు. అలాగే రబీ, ఖరీఫ్ సీజన్లలో 5 లక్షల 27 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. సమావేశంలో ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ సుమలత, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, సంఘ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, సీఈవో మామిడాల అశోక్‌కుమార్, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు ఏగోళపు శంకర్‌గౌడ్, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ లక్ష్మణ్, డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్త శ్రీనివాస్

నిరుద్యోగ యువతకు అండగా బీజేపీ పోరాటం

పెద్దపల్లిరూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలను కల్పించి న్యాయం చేసేదాకా బీజేపీ అండగా ఉండి పోరాడుతుందని బీజేపీ నాయకుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన నిరుద్యోగ మహా ధర్నాకు వెళ్లకుండా పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా తన నివాసంలో మాట్లాడారు. తెలంగాణ అధికారంలోకి వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు అని చెప్పిన కేసీఆర్ దానికి విరుద్ధంగా దోచుకో..దాచుకో అన్న చందంగా తెలంగాణ సహజ సంపద అంతా తన బంధుగణం దోచుకునేలా ప్రోత్సహిస్తున్నాడని ఆరోపించారు. విద్యావంతులైన యువత తమకు ఉద్యోగాలు దక్కుతాయనే ఆశతో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించి రాసిన పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఆందోళనలో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారాన్ని సీబీఐ తో విచారణ జరిపించాలని, సంబంధాలున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు కందునూరి ప్రమోద్‌రావు, ఫయాజ్, కరుణాకర్, మనోహర్, శ్రీనివాసరెడ్డి, సతీశ్ రమేశ్ పాల్గొన్నారు.



గృహనిర్బంధంలో బీజేపీ నాయకుడు సురేశ్‌రెడ్డి

వడగండ్ల వానకు అపార నష్టం

ఎలిగేడు: ఇటీవల మండలంలో కురిసిన వడగండ్ల వానకు మండలంలోని లాలపల్లి గ్రామంతోపాటు అన్ని గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయల పంటల దెబ్బతిని అపార నష్టం వాటిల్లిందని లాలపల్లి ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి అన్నారు. లాలపల్లిలో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ లాలపల్లిలోనే ఎక్కువగా పంట పొలాలకు, ఇళ్లకు అపార నష్టం వాటిల్లినప్పటికీ ప్రభుత్వం నుంచి ఏ అధికారి నుంచి స్పందన లేదని విమర్శించారు. ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు దెబ్బతిన్న వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు.



రాలిన మామిడికాయలు చూపిస్తున్న రైతులు